క్లుప్తంగా

యువజన విభాగం అధ్యక్షుడిగా సైదులు



కేతేపల్లి : వైఎస్సార్ తెలంగాణ పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడిగా మండలంలోని కాసనగోడు గ్రామానికి చెందిన దండుగుల సైదులు నియమితులయ్యారు. ఈమేరకు పార్టీ జిల్లా అధ్యక్షుడు ఇంజం నర్సిరెడ్డి మంగళవారం ఉత్తర్వుల కాపీ అందజేశారు. ఈసందర్భంగా సైదులు మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధులు పిట్ట రాంరెడ్డి, ఏపూరి సోమన్నలకు కృతజ్ఞతలు తెలిపారు.

సెలవుదినంగా ప్రకటించాలి

చండూరు(గట్టుప్పల) : బంజారాల (లంబాడీ) ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి ఫిబ్రవరి 15న ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించాలని లంబాడీల ఐక్య వేదిక ఉద్యోగుల రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఉదావత్ లచ్చిరాంనాయక్ కోరారు. గట్టుప్పల మండల కేంద్రంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రతి తండాలో సేవాలాల్ మహారాజ్ ఆలయ నిర్మాణాన్ని ప్రభుత్వమే చేపట్టాలన్నారు.

షుగర్, బీపీ కిట్ల పంపిణీ



కిట్లు అందజేస్తున్న సర్పంచ్ సుధాకర్‌నాయక్

మర్రిగూడ : బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా అందజేస్తున్న ఎన్‌సీడీ కిట్లను మండలంలోని కుదభాక్షపల్లి, లెంకలపల్లి గ్రామాల్లో మంగళవారం సర్పంచ్‌లు అంబోతు సుధాకర్‌నాయక్, పాక నగేష్ అందజేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ మైలారపు పార్వతమ్మగిరీష్, ఏఎన్‌ఎంలు సునీత, కలమ్మ, జ్యోతి, మల్లీశ్వరి, ఆశ కార్యకర్తలు, పద్మ, జయమ్మ, లక్ష్మీ, సైదాబీ, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్‌కు వేతనం అందజేత



చెక్కు అందజేస్తున్న ఉపేందర్

చిట్యాల : వనిపాకల గ్రామానికి చెందిన డీకేఆర్ ఫౌండేషన్ చైర్మన్, ఎన్‌ఆర్‌ఐ దూదిగామ కిరణ్‌కుమార్ ఆ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యా వలంటీర్ వేతనానికి సమకూర్చిన రూ.20 వేల చెక్కును మంగళవారం హెచ్‌ఎం కౌసల్యకు ఫౌండేషన్ వైస్‌చైర్మన్ ఉపేందర్ అందజేశారు. అదేవిధంగా చిట్యాల పట్టణంలోని జెడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన నలభై ఐదు మంది విద్యార్థులకు సత్యసాయి సేవా సమితి భజన మండలి ప్రతినిధులు రైటింగ్ ప్యాడ్స్, పెన్నులు, బిస్కెట్ ప్యాకెట్స్ అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో హెచ్‌ఎం గోగికార్ మాధవి, సేవా సంస్థ ప్రతినిధులు మేడిశెట్టి ఝూన్సీ, అంజయ్య, నాగలక్ష్మి, జ్యోతి, సువర్ణ, రజనీ, జయస్పందన పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ల ధర్నా



ధర్నా నిర్వహిస్తున్న ఆటో డ్రైవర్లు

మర్రిగూడ : మాల్ నుంచి మర్రిగూడకు వెళ్లే 2కి.మీ మేర డబుల్‌రోడ్డును పూర్తి చేయాలని ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి చల్లం పాండురంగారావు ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం మాల్ సమీపంలో ఆటో యూనియన్ డ్రైవర్లు రోడ్డుపై బైఠాయించి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పాండురంగారావు మాట్లాడుతూ మాల్‌లో రహదారి పనులు పూర్తి చేయకపోవడంతో వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. తక్షణమే రోడ్డు పనులను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బెల్లి జంగయ్య, జమ్ముల వెంకటయ్య, గాలయ్య, ఆటో యూనియన్ నాయకులు వనం పున్నమయ్య, జిల్లా నాగరాజు, నవీన్, వెంకటయ్య, రామలక్ష్మయ్య, జహంగీర్, అనిల్, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ చైర్మన్‌కు అభినందనలు



శుభాకాంక్షలు తెలుపుతున్న కేశవులు

రామగిరి(నల్లగొండ) : శాసన మండలి డిప్యూటీ చైర్మన్‌గా నియామకమైన డాక్టర్ బండా ప్రకాష్‌ను సమాచార హక్కు పరిరక్షణ సమితి జాతీయ చైర్మన్ బొమ్మరబోయిన కేశవులు మంగళవారం హైదరాబాద్‌లో కలిసి పుష్ప గుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట గుండ్లపల్లి సందీప్, గాదం యాదగిరి, జగన్, భువనగిరి సందీప్, రావుల మహేష్ తదితరులు ఉన్నారు.

నెరవేరనున్న దశాబ్దాల కల

- రూ.32 కోట్ల వ్యయంతో నకిరేకల్‌లో 100 పడకల వైద్యశాల
- ముమ్మరంగా నిర్మాణ పనులు
- ఏడాదిన్నర లోగా పూర్తి చేయాలని గడువు

నకిరేకల్ : నకిరేకల్ ప్రాంత ప్రజల దశాబ్దాల కల సాకారం కానుంది. నియోజకవర్గంలోని పలు గ్రామాల ప్రజలకు మెరుగైన ప్రభుత్వ వైద్యసేవలు అందుబాటులోకి రానున్నాయి. స్థానిక ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ప్రత్యేక చొరవతో మంత్రి జగదీశ్‌రెడ్డి సహకారంతో 2022 జనవరి 21వ తేదీన నకిరేకల్ 30 పడకల వైద్యశాలను 100 పడకలకు అప్‌గ్రేడ్ చేస్తూ తెలంగాణ ప్రభుత్వ వైద్యవిధాన పరిషత్ సెక్రటరీ ఎస్ ఎఎం. రిజ్వీ జీఓ ఆర్టీ నంబర్ 27 ను జారీ చేశారు. ఈ భవన సముదాయాన్ని అందరికీ అందుబాటులో ఉండేలా స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో జాతీయ రహదారి వెంట రూ.32 కోట్ల వ్యయంతో ఆరు ఎకరాల సువిశాలమైన స్థలంలో నిర్మిస్తున్నారు. గత ఏడాదిలో చివరిలో ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ శంకుస్థాపన చేయగా.. 2022 డిసెంబర్ మాసంలో నిర్మాణ పనులను రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య, స్థానిక ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ప్రారంభించారు. గడిచిన రెండున్నర మాసాలుగా నిర్మాణ పనులు చురుకుగా సాగుతున్నాయి. నాణ్యత ప్రమాణాలతో నిర్మాణం సాగాలని స్థానిక ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య వారానికి రెండు దఫాలుగా సందర్శిస్తూ అధికారులను అప్రమత్తం చేస్తున్నారు. పనులు ప్రారంభించిన నాటినుంచి ఏడాదిన్నర లోపు పూర్తి చేయాలని వైద్యశాఖ గడువు విధించింది.

మెరుగైన వైద్యసేవలకు బాటలు

100 పడకల వైద్యశాల భవన నిర్మాణ పనులు పూర్తయితే ఈ ప్రాంత పేద ప్రజలకు మరింత మెరుగైన వైద్యసేవలు అందుబాటులోకి రానున్నాయి. జాతీయ రహదారి పై ఉన్నప్పటికీ నకిరేకల్‌లోని 30 పడకల వైద్యశాల కేవలం ప్రథమ చికిత్సకే పరిమితమవుతోంది. గతంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంగా ఉన్న ఈ వైద్యశాలను 1998లో 30 పడకల కమ్యూనిటీ వైద్యశాలగా మార్చారు. రోజుకు 300 నుంచి 450 మధ్య ఓపీ నమోదవుతోంది. ప్రతిరోజూ రోగులు అధికంగా వస్తున్నా అరకొర వసతుల మధ్య వైద్య సేవలు అందిస్తున్నారు. ఓపీ చూడడం కోసం మూడు గదులు మాత్రమే ఉన్నాయి. కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్స సమయంలో సరైన వసతులు లేక నేలపైనే పడుకోబెట్టాల్సిన దుస్థితి నెలకొంది. ప్రాణాపాయ స్థితిలో ఈ వైద్యశాలకు చేరిన వారికి కృత్రిమ శ్వాస అందించే వెంటిలేటర్ సౌకర్యం లేదు. 24 సంవత్సరాలుగా వైద్యశాల స్థాయి పెరగలేదు. జాతీయ రహదారిపై అనేక రోడ్డు ప్రమాదాలు జరిగి కొన ఊపిరితో ఇక్కడికి వచ్చినా.. ఈ వైద్యశాలలో మెరుగైన వైద్యసేవలు అందక జిల్లా ఆస్పత్రికి వెళ్లే క్రమంలో మార్గమధ్యలోని అనేకమంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ప్రభుత్వ వైద్యశాలకు నకిరేకల్‌తోపాటు కట్టంగూర్, కేతేపల్లి, శాలిగౌరారం, తిప్పర్తి మండలాల ప్రజలు వైద్యం నిమిత్తం వస్తారు. ఈ ఆస్పత్రిని విస్తరించాలని స్థానిక ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ఆధ్వర్యంలో మంత్రి జగదీశ్‌రెడ్డి సహకారంతో మంత్రి కేటీఆర్ సారథ్యంలో ప్రతిపాదనలు పంపగా.. సీఎం కేసీఆర్ 2021 సంవత్సరంలో ఆమోద ముద్ర వేశారు. 2022 జనవరి 21వ తేదీన రూ.32 కోట్లు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.



కొనసాగుతున్న ఆస్పత్రి నిర్మాణ పనులు

అనేక ప్రయోజనాలు

నకిరేకల్‌లో 100 పడకల వైద్యశాల అందుబాటులోకి వస్తే ప్రజలకు అనేక ప్రయోజనాలు అందనున్నాయి. మాతా శిశువులకు సంబంధించి ప్రత్యేక సేవలు అందుబాటులోకి వస్తాయి. ఎమర్జెన్సీ సెక్షన్‌లో గర్భిణులకు ఆపరేషన్లు చేయనున్నారు. 24 గంటలు గైనకాలజీ, అనస్తీషియా సర్వీసులు అందుబాటులోకి వస్తాయి. నవజాత శిశువులకు ప్రత్యేక సేవలు అందుతాయి. ఆరోగ్యశ్రీ సేవలు అన్ని విభాగాలకు ఉంటాయి. ఓపీ సంబంధించి జనరల్ మెడిసిన్, జనరల్ సర్జన్, ఆర్థోపెడిక్, పీడియాట్రిక్, చెవి, ముక్కు, గొంతు, కంటి, డయాలసిస్ సేవలు కూడా అందుబాటులోకి వస్తాయి. గర్భిణులకు యూఎస్‌జీ (అల్ట్రాసౌండ్ స్కాన్, ఎక్స్‌రే) ఇతర రక్త పరీక్షలు చేయనున్నారు.

వైద్యసేవలు మరింత అందుబాటులోకి రానున్నాయి



నకిరేకల్‌లో రూ.32 కోట్లతో నిర్మిస్తున్న 100 పడకల వైద్యశాల భవన నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు లోపించకుండా చర్యలు తీసుకుంటున్నాం. 100 పడకల వైద్యశాలగా మార్చాలని మంత్రి జగదీశ్‌రెడ్డి సహకారంతో మంత్రి కేటీఆర్ నేతృత్వంలో సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకువెళ్లా.. నకిరేకల్‌కు 100 పడకల వైద్యశాలను మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. 100 పడకల వైద్యశాలతో నకిరేకల్ నియోజకవర్గ ప్రజలకు వైద్యసేవలు మరింత అందుబాటులోకి రానున్నాయి. వచ్చే ఏడాది ప్రారంభంలో భవన సముదాయం పూర్తి చేసి వినియోగంలోకి తెస్తాం.

–చిరుమర్తి లింగయ్య, నకిరేకల్ ఎమ్మెల్యే

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

కట్టంగూర్ : ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. మంగళవారం మండలంలోని గార్లబాయిగూడెంలో రూ.15లక్షలు, కురుమర్తిలో రూ.20లక్షలతో సీసీ రోడ్లకు ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో జెడ్పీటీసీ తరాల బలరాములుయాదవ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఏడుకొండలు, సర్పంచ్‌లు గుర్రం సైదులు, బోడ సరితయాదగిరి, ఎంపీటీసీ బీరెల్లి రాజ్యలక్ష్మిప్రసాద్, ఉప సర్పంచ్ ఆవుల సైదులు, వార్డు సభ్యులు వసంత, శ్రీను, శ్రీరాములు, భాగ్యమ్మ వంగూరి సైదులు, కొంపెల్లి సైదులు, అంజయ్య ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ మెండు మోహన్‌రెడ్డి

మర్రిగూడ : అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని ఎంపీపీ మెండు మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ మెండు మోహన్‌రెడ్డి అధ్యక్షతన మంగళవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఆయిల్‌పామ్ మొక్కల పెంపకంపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ప్రత్యామ్నాయ పంటలపై ఆసక్తి పెంచుకొని ప్రభుత్వ రాయితీలను పొందాలని సూచించారు. పలువురు ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ యరగండ్లపల్లి ప్రభుత్వ స్థలాల్లో అనర్హులు ఇంటి నిర్మాణాలు చేపడుతున్నారని పేర్కొన్నారు. మునుగోడు ఉప ఎన్నికలో విధులు నిర్వహించిన అధికారులు, సిబ్బందికి భోజనం ఏర్పాటుచేసిన మధ్యాహ్న భోజన ఏజెన్సీలకు బిల్లులను పూర్తి స్థాయిలో చెల్లించలేదని ఎంఈఓ గురువారావు ఎంపీపీ దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం పుల్వామా దాడిలో మరణించిన అమరవీరులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పాశం సురేందర్‌రెడ్డి, ఎంపీడీఓ జె.వెంకటేశ్వర్‌రావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దంటు జగదీశ్వర్, వైస్ ఎంపీపీ కట్కూరి వెంకటేష్‌గౌడ్, కోఆప్షన్ మెంబర్ యాకుబ్‌అలీ, ఏఓ ఆవుల స్పందన, హెచ్ఓ శ్వేత, ఆర్‌అండ్‌బీ ఏఈ అనిత, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వెంకటేశ్వర్లు, డీటీ తారకరామన్, వైద్యులు తరుణ్, శంకర్, ఏపీఓ వెంకటేష్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మ, సూపరింటెండెంట్ యాకుబ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో సమస్యలు రాకుండా చూడాలి



ప్రజలతో మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీదేవి

గ్రామాల్లో ప్రజలకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని నకిరేకల్ ఎంపీపీ బచ్చుపల్లి శ్రీదేవిగంగాధర్‌రావు అధికారులకు సూచించారు. నకిరేకల్ మండలం నెల్లిబండ గ్రామంలో మంగళవారం ఆమె పర్యటించారు. ఈసందర్భంగా ప్రజలు వివిధ సమస్యలను ఆమె దృష్టికి తెచ్చారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ గ్రామానికి వచ్చే ప్రధాన దారిలో అడ్డంగా ఉన్న కంప చెట్లను తొలగించాలని గ్రామ అధికారులకు సూచించారు.

ఎంపీపీకి వినతి

ఆశ కార్యకర్తలకు కనీస వేతనం రూ.18,500 ఇవ్వాలని కోరుతూ నకిరేకల్‌లో ఎంపీపీ బచ్చుపల్లి శ్రీదేవికి ఆశ సంఘం జిల్లా అధ్యక్షురాలు సింగం రేణుక ఆధ్వర్యంలో మంగళవారం వినతి పత్రం అందజేశారు. 17 ఏళ్ల నుంచి ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని కోరారు.

బొడ్రాయి ప్రతిష్ఠాపనకు ఎంపీ కోమటిరెడ్డి విరాళం

శాలిగౌరారం : మండలంలోని ఇటుకులపహాడ్ గ్రామంలో మంగళవారం ప్రారంభమైన బొడ్రాయి ప్రతిష్ఠాపన, పునర్నిర్మాణం జరిగిన శివాలయ ప్రారంభోత్సవానికి భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. రూ.50వేలు బొడ్రాయి ప్రతిష్ఠాపనకు, రూ. 50వేలు శివాలయ నిర్మాణానికి విరాళంగా అందజేశారు. ఈ నగదును మంగళవారం ఆకారం సర్పంచ్ కందాల సమరంరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు బండపల్లి కొమరయ్య, బొమ్మగాని రవి ఇటుకులపహాడ్ సర్పంచ్ అల్లి సైదులు చేతులమీదుగా ఉత్సవ నిర్వాహకులకు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కాంచాని యాదగిరి, గోదల వెంకట్‌రెడ్డి, అయితగోని వెంకన్న, దండంపల్లి అనిల్, సూర సుధాకర్, శీలం సుదర్శన్, రాజు, మహేశ్, అశోక్, పాల్గొన్నారు.

ప్రచార రథం ప్రారంభం



ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

మునుగోడు : మండలంలోని కిష్టాపురం గ్రామంలో నిర్మించనున్న ఫార్మా కంపెనీ అనుమతులను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 16 న చేపట్టే మహాధర్నాను విజయవంతం చేయాలని ఏర్పాటు చేసిన ప్రచార రథాన్ని అఖిలపక్ష కమిటీ ప్రజాప్రతినిధులు, నాయకులు మంగళవారం ప్రారంభించారు. ధర్నాకు ప్రజలు అధిక సంఖ్యలో హాజరు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మునుగోడు సర్పంచ్ మిర్యాల వెంకటేశ్వర్లు, మునుగోడు ఎంపీటీసీ– 2 ఈద నిర్మల, శరత్‌బాబు, ఊకొండి ఎంపీటీసీ పోలగోని విజయలక్ష్మిసైదులు, కిష్టాపురం ఎంపీటీసీ భీమనపల్లి సైదులు, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గురిజ రామచంద్రం, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు తిర్పరి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌కో డీఈకి వినతి



వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

నల్లగొండ టూటౌన్ : వ్యవసాయానికి 24 గంటలు విద్యుత్ సరఫరా చేసి పంటలు కాపాడాలని కోరుతూ బీజేపీ కిసాన్ మోర్చా నాయకులు మంగళవారం ట్రాన్స్‌కో డీఈకి వినతి పత్రం అందజేశారు. ప్రస్తుత యాసంగి సీజన్‌లో విద్యుత్ సరఫరా సరిగ్గా చేయకపోవడంతో వరి చేలు ఎండిపోతున్నాయని, తోటలు కూడా ఎండిపోయే పరిస్థితి ఉందని డీఈకి వివరించారు. అప్రకటిత కరెంట్ కోతలను నివారించి, 24 గంటల విద్యుత్ ఇవ్వాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో కిసాన్ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు గోలి మధుసూదన్‌రెడ్డి, జిల్లా నాయకులు దాసోజు యాదగిరాచారి, పాలకూరి రవిగౌడ్, బీపంగి జగ్జీవన్, మల్లేష్, నగేష్‌యాదవ్ తదితరులు ఉన్నారు.

నియామక పత్రం అందజేత

నకిరేకల్ : నకిరేకల్ పట్టణ బీజేపీ ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శిగా 17వ వార్డు ఎస్సీ కాలనీకి చెందిన నల్గొండ లింగయ్య నియామకమయ్యారు. ఈమేరకు ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు గోలి ప్రభాకర్ మంగళవారం నియమాక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా లింగయ్య మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

మహా శివరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి

రామగిరి(నల్లగొండ) : పానగల్లు ఛాయా సోమేశ్వరాలయంలో ఫిబ్రవరి 15 నుంచి 19 వరకు జరిగే మహా శివరాత్రి ఉత్సవాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి తెలిపారు. మహా శివరాత్రి సందర్భంగా పానగల్లు ఛాయా సోమేశ్వరాలయం ఆధ్వర్యంలో రూపొందించిన పోస్టర్‌ను మంగళవారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చారిత్రక ఆలయమైన ఛాయా సోమేశ్వరాలయానికి శివరాత్రి సందర్భంగా భక్తుల తాకిడి ఎక్కువగా ఉండే అవకాశం ఉందన్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా బారికేడ్లు, శానిటరింగ్, మంచి నీటి వసతి ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రూ.123 కోట్ల వ్యయంతో ఉదయ సముద్రం ట్యాంక్‌బండ్, పానగల్లు ఆలయాలు అత్యద్భుతంగా రూపుదిద్దుకోనున్నాయని అన్నారు. ఈ సమావేశంలో ఆర్డీఓ జయచంద్రారెడ్డి, మున్సిపల్ కమిషనర్ రమణాచారి, డీఎస్పీ వెంకటేశ్వరరెడ్డి, మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి, వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ గంట్ల అనంతరెడ్డి, ఎండోమెంట్ అధికారి వెంకటలక్ష్మి , ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

దృష్టి లోపం నివారణకే కంటి పరీక్షలు



పరీక్షలు చేయించుకున్న వ్యక్తికి కళ్లజోడు పెడుతున్న నల్లగొండ మున్సిపల్ చైర్మన్ సైదిరెడ్డి

నల్లగొండ టూటౌన్ : దృష్టి లోప నివారణకే కేసీఆర్ ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమం నిర్వహిస్తోందని మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి అన్నారు. మంగళవారం నల్లగొండ మున్సిపాలిటీ పరిధిలోని 14వ వార్డు మర్రిగూడ ఆరోగ్య ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కంటి వెలుగు శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఒక్క రూపాయి ఖర్చు లేకుండా ప్రభుత్వమే ఉచితంగా పరీక్షలు చేసి కళ్ల జోళ్లు అందజేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి కొండల్‌రావు, కౌన్సిలర్లు ఊట్కూరు వెంకట్‌రెడ్డి, బొజ్జ శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగు శిబిరాల తనిఖీ

నల్లగొండ టూటౌన్ : పట్టణంలోని వివిధ వార్డుల్లో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాలను మంగళవారం మున్సిపల్ కమిషనర్ కె.వీ. రమణాచారి తనిఖీ చేశారు. 3వ వార్డులో ఏర్పాటు చేసిన శిబిరంలో మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. శానిటేషన్ సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట అధికారులు అశోక్, నరసింహారెడ్డి, నాగిరెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు మూర్తుజాఅలీ, సురిగి శంకర్, ఇతర సిబ్బంది ఉన్నారు.

కేతేపల్లి : కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని చీకటిగూడెం సర్పంచ్ కోట వెంకటేశ్వరరావు కోరారు. మంగళవారం మండలంలోని చీకటిగూడెం గ్రామంలో ఏర్పాటు చేసిన రెండో విడత కంటి వెలుగు శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీటీసీ నర్మదనాగేశ్వరరావు, ఉప సర్పంచ్ శ్రీలత, మండల వైద్యాధికారి అర్చన, పంచాయతీ కార్యదర్శి రాంప్రసాద్, వైద్య సిబ్బంది జానకమ్మ, సుశీల తదితరులు పాల్గొన్నారు.

బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దు



మాట్లాడుతున్న బండారు రమేష్

నల్లగొండ టౌన్ : ప్రస్తుత సమాజంలో యువతను చెడుదారి పట్టించడం కోసం మతోన్మాద భావజాలం తీసుకొస్తున్నారని, యువత దానికి ఆకర్షితులై భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని ప్రముఖ విద్యావేత్త బండారు రమేష్ పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన డీవైఎఫ్ఐ రాష్ట్ర స్థాయి మొదటి రోజు సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఆర్‌ఎస్‌ఎస్ విధానాలను దేశం మీద ప్రయోగించి దేశ సమైక్యతను దెబ్బతీసే ప్రయత్నాలు పెరిగిపోయాయని విమర్శించారు. ఈ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేష్, కార్యదర్శి అనగంటి వెంకటేశ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మల్లం మహేష్, ఎస్‌కె బషీర్, శివవర్మ, గడ్డం వెంకటేశ్, ఎండీ జావిద్, బి.నవీన్, జగన్, రోషినిఖాన్, కిరణ్, జిల్లా కార్యదర్శి ప్రవీన్ తదితరులు పాల్గొన్నారు.

అమరవీరులకు కొవ్వొత్తులతో నివాళి



నివాళులర్పిస్తున్న ఎన్జీ కళాశాల సిబ్బంది



కట్టంగూర్‌లో నివాళులర్పిస్తున్న యువకులు

రామగిరి(నల్లగొండ) : దేశ రక్షణలో సైనికుల త్యాగం మరువలేనిదని ఎన్జీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఘనశ్యామ్ అన్నారు. పుల్వామా దాడిలో అమరులైన సైనికులకు మంగళవారం ఎన్జీ కళాశాల సిబ్బంది కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ రక్షణ అందరి బాధ్యత అని, యువత సైనిక రంగంలోకి వచ్చి దేశానికి సేవ చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కృష్ణకౌండిన్య, యాదగిరిరెడ్డి, దుర్గాప్రసాద్, వెంకటేశం, ఎన్‌సీసీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కట్టంగూర్ : పుల్వామా ఉగ్రవాదుల దాడిలో అమరులైన భారత జవాన్ల ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ స్థానిక హైస్కూల్‌లో స్టంటర్స్ యూత్ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. అదేవిధంగా సాందీపని పాఠశాలలో విద్యార్థులు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో చెరుకు శ్రీనివాస్, పూలస్వామి, పోగుల సురేష్, మహేష్, శ్రీను, యాదగిరి, కిరణ్, నరేష్ తదితరులు ఉన్నారు.

దామోదరం సంజీవయ్య జయంతి



నివాళులర్పిస్తున్న నాయకులు

నల్లగొండ : తొలి దళిత ముఖ్యమంత్రి దామోదర్ సంజీవయ్య 102వ జయంతిని మంగళవారం కాంగ్రెస్ పార్టీ ఎస్సీసెల్ అధ్యక్షుడు ఆదిమల్ల శంకర్ ఆధ్వర్యంలో నల్లగొండలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంజీవయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చెరుకు సుధాకర్, తండు సైదులుగౌడ్, ఓబీసీ జిల్లా అధ్యక్షుడు జిల్లపల్లి పరమేష్, చర్లపల్లి గౌతమ్, శివరామకృష్ణ, నర్సింగ్ మురళీధర్‌గౌడ్, ఇబ్రహీం, ముంతాజ్, గిరి, సోషల్ మీడియా కోఆర్డినేటర్ ఆర్ల సూర్యప్రకాష్, పగిళ్ల శివ, బుర్రి శంకర్, సుధీర్, గురుజాల బొజ్జ నాగరాజు, జాకటి సుమన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా గోస - బీజేపీ భరోసా



మాట్లాడుతున్న వీరెల్లి చంద్రశేఖర్

మునుగోడు : పేదల అభివృద్ధి కోసమే కేంద్ర ప్రభుత్వం పనిచేస్తోందని బీజేపీ రాష్ట్ర నాయకుడు వీరెల్లి చంద్రశేఖర్ అన్నారు. మునుగోడు మండల కేంద్రంలో మంగళవారం ప్రజా గోస–బీజేపీ భరోసా కార్నర్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రాష్ట్రంలో 1100 శక్తి కేంద్రాల్లో ప్రజా గోస –బీజేపీ భరోసా కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. మునుగోడు అసెంబ్లీ కన్వీనర్ దూడల భిక్షం గౌడ్, పందుల భాస్కర్, ఇప్పర్తి మాజీ సర్పంచ్ బూడిద లింగయ్య యాదవ్, పాల్గొన్నారు.

పశువైద్య శిబిరం

కట్టంగూర్ : మండలంలోని మల్లారం గ్రామంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత పశువైద్య శిబిరాన్ని ఆ గ్రామ సర్పంచ్ దాసరి సంజయ్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామాల్లో నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను పాడి రైతులు, మేకల, గొర్ల కాపరులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారి బిక్యానాయక్, సూరయ్య, నర్సింహ, సాయన్న, రాములు, గోపాల మిత్ర చెరుకు శ్రీనివాస్, సిబ్బంది సంజయ్ ఉన్నారు.



శిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ సంజయ్

బీజేపీలో పలువురి చేరిక

చిట్యాల : మండలంలోని చిట్యాల, నేరడ గ్రామానికి చెందిన పలువురు మంగళవారం బీజేపీ రాష్ట్ర నాయకుడు శేపూరి రవీందర్ సమక్షంలో బీజేపీలో చేరారు. చిట్యాలలో ఆగు సైదులు ఆధ్వర్యంలో 30 మంది యువకులు, నేరడ గ్రామానికి చెందిన వడ్డెపల్లి శ్రీను, వెంకటయ్య ఆధ్వర్యంలో పలువురు పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నకిరేకల్ నియోజకవర్గ కన్వీనర్ మైల నర్సింహ, పార్టీ మండల అధ్యక్షుడు పొట్లపల్లి నర్సింహగౌడ్, మండల ప్రధానకార్యదర్శి బొడిగె లక్ష్మయ్యగౌడ్, చిట్యాల పట్టణ అధ్యక్షుడు కూరెళ్ళ శ్రీను, ప్రధానకార్యదర్శి గంజి గోవర్ధన్, మాస శ్రీనివాస్, కన్నెబోయిన మహాలింగం, కోళ్ళ స్వామి, జిట్ట కృష్ణ, చికిలం మెట్ల అశోక్, పాపని వాసుదేవ్, రావుల వెంకన్న పాల్గొన్నారు.


బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడిగా పల్లపు బుద్ధుడు



నియామక పత్రాన్ని అందజేస్తున్న రాజశేఖర్‌రెడ్డి

చిట్యాల : మండలంలోని ఉరుమడ్ల గ్రామానికి చెందిన పల్లపు బుద్ధుడును జిల్లా బీజేపీ కార్యవర్గ సభ్యుడిగా నియమిస్తూ బీజేపీ జిల్లా అధ్యక్షుడు కంకణాల శ్రీధర్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. నియామక పత్రాన్ని ఆ పార్టీ జిల్లా ప్రధానకార్యదర్శి నిమ్మల రాజశేఖర్‌రెడ్డి మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా బుద్ధుడు మాట్లాడుతూ బీజేపీ బలోపేతానికి కృషి చేస్తానన్నాడు. తన నియామకానికి సహకరించిన పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

బాలల పరిరక్షణ అందరి బాధ్యత



మాట్లాడుతున్న ఎంపీపీ మెండు మోహన్‌రెడ్డి

మర్రిగూడ : బాలల పరిరక్షణ మనందరి బాధ్యత అని ఎంపీపీ మెండు మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో బాలల హక్కులపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. బాల్య వివాహాలు, బాల కార్మికులు, బాలల అక్రమ రవాణా, లింగ వివక్షతపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో చింతపల్లి సీడీపీఓ లావణ్యకుమారి, ఎంపీడీఓ జె.వెంకటేశ్వర్లు, డీటీ తారకరామన్, ఎంఈఓ గురువారావు, వైద్యులు తరుణ్, పాక నగేష్‌యాదవ్, రాములు, తిప్పన్న, గీత, శంకర్‌రెడ్డి, సంధ్య, పద్మ, యశోద, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.